



# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 15 సెప్టెంబర్ 2024 తెలంగాణ ప్రాంతీయం


## క్రీడలతో పాటు చదువులో రాణిస్తే బంగారు భవిష్యత్తు

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా సెప్టెంబర్ 14: నినాదం న్యూస్,**

క్రీడలతో పాటు చదువులో రాణిస్తే.. బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం శ్రీ సాయి మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీ డివిజన్ ఫేజ్-1 గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ తెలంగాణ ఇంటర్ డిస్టిక్ ఖోఖో ఛాంపియన్షిప్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి ఖోఖో ఆటల పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఖోఖో రాష్ట్ర అధ్యక్షులు జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే జెండా ఆవిష్కరణ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు అందించిన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు ఆటలు ఆడటం శారీరక ఎదుగుదల దృఢంగా, ఫిట్ గా ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పిల్లలు ఆటల పోటీల్లో రాణించాలని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తల్లిదండ్రులకు, రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తెచ్చే విధంగా ఆటల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి మోడల్ హైస్కూల్ రెస్పాండెంట్ సందీప్, నాయకులు చారి, కిరణ్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్, వాసు, ఉస్మాన్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య

**చేవెళ్ల సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదరునిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఎమ్మెల్యే ప్రోచారం శ్రీనివాస్ రెడ్డిని, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు



**చింతపల్లి ,సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్)**

మండలంలోని తీదేడు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష పండితుడు లెంకల రామ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు, హిందీ భాష ప్రాముఖ్యత పట్ల సమగ్రంగా వివరించారు. దేశంలో 70 శాతం మంది ప్రజలు హిందీ భాష మాట్లాడతారని ఆయన అన్నారు. జాతీయ భాష హిందీ పట్ల శ్రద్ధ చూపి, నేర్చుకున్న వారు దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా తమ భావాలను తెలియజేయవచ్చని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతో ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మ , ఎర్ర శ్రీరాములు, బి. శ్రీరాములు, పాల్వాయి వాసుదేవ రెడ్డి, విష్ణుకాంత, చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి రాం రెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్)**

మాజీ మంత్రి సూర్యాపేట నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేకును ఆయన కట్ చేశారు. వార్డులలో కౌన్సిలర్లు నాయకులు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. తమ అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలుపుటకు జిల్లా పార్టీ కార్యాలయానికి వేలాదిమంది, కార్యకర్తలు నాయకులు అభిమానులు రావడంతో క్యాంపు కార్యాలయం సందడి నెలకొంది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే తమ బలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో సూర్యాపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి ,పోతు భాస్కర్, పట్టణ అధ్యక్షుడు అంజద్ అలి,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.




## విఘ్నాలు తొలగించే వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్**

**చేవెళ్ల సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్):**

విఘ్నాలు తొలగించే మహా గణనాథుని చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల అలంఖాన్ గూడ గ్రామంలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా కందూరి మాధవి, శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామేన భీమ్ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రతేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచే గణనాథునికి చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాత కందురి మాధవి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గణపయ్యకు పూజ చేసుకునే అవకాశం నాకు కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, బద్దం కృష్ణారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శరత్ రెడ్డి, నజరుద్దీన్, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, గ్రామ ప్రజలు, గ్రామ మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14 నినాదం న్యూస్**




విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన గోరి కొత్తపల్లి మండలం నిజాంపల్లి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బమ్మ అశోక్ (40) వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చి స్నానం చేసి ఇంటి ముందు ఉన్న దండంపై ఆరేసిన బట్టలు తీస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై ఎన్ సందీప్ కుమార్ తెలిపారు. ఇల్లు రేకుల షెడ్డు కావడంతో ఇంట్లోకి వచ్చే కరెంటు తీగ ఐరన్ పైపులకు తాకి బట్టలు ఆరేసే దండానికి కరెంటు రావడంతో కరెంట్ షాక్ గురై మృతి చెందినట్లు స్థానికులు గుర్తించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతుని భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలానికి విద్యుత్ అధికారులు చేరుకొని సంఘటన వివరాలను సేకరించినట్లు తెలిపారు. మృతునికి కొడుకు, కూతురు ఉన్నారు. విద్యుత్ షాక్ గురై మృతి చెందిన అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## డీజే లౌడ్ స్పీకర్స్ పెడితే కేసులు నమోదు చేస్తాం

**-సీఐ భూపాల్ శ్రీధర్**

**చేవెళ్ల సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్ ):**





నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని వినాయక నిమర్జనం సందర్భంగా మండపాల దగ్గర డిజె సౌండ్స్ పెడుతూ నాయిస్ పొల్యూషన్‌కు కారణం అయినవారిపైన కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని వివిధ మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక నిమర్జనం సమయంలో డీజే లడ్డు స్పీకర్స్ పెద్ద పెద్ద సౌండ్ వచ్చే పరికరాలు ఉపయోగించకుండా ప్రశాంత వాతావరణంలో నిమర్జనాలు చేసుకోవాలని అన్నారు. చేవెళ్ల మండలం పామేన గ్రామానికి చెందిన రాజ్ కుమార్ దగ్గర సౌండ్ పాడు బ్యాండ్, షాబాద్ మండలం ఎట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజు దగ్గర డిజె మాస్టర్ మిక్సర్, చేవెళ్ల గ్రామానికి చెందిన బేకరీ విష్ణు దగ్గర డీ జే సౌండ్ సౌండ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాయిస్ పొల్యూషన్ కి కారణమయ్యే డిజె సాంగ్స్ లౌడ్ స్పీకర్, పెట్టే వారి పైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## పబ్‌లపై దాడులు..

**చేవెళ్ల సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్ ):**

నలగురికి డ్రగ్స్ పాజిటివ్ పట్టణాల నుంచి చివరకు ఈ సంస్కృతి గ్రామాల వరకూ చేరింది. రాష్ట్రాన్ని డ్రగ్స్ పట్టిపీడిస్తున్నాయి. పోలీసులు ఎంత కట్టడిచేస్తున్నా నిత్యం డ్రగ్స్ సరఫరా మాత్రం ఆగడం లేదు. నిత్యం ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు దాడులు చేసి పట్టుకుంటున్నా డ్రగ్స్ ప్లెడ్లర్స్ మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. నిత్యం కోట్లాది రూపాయల విలువ చేసే డ్రగ్స్ పట్టుబడుతూనే ఉంది. పట్టణాల నుంచి చివరకు ఈ సంస్కృతి గ్రామాల వరకూ చేరింది. గ్రామాల్లోనూ డ్రగ్స్ సేవిస్తున్న వారి సంఖ్య నిత్యం పెరుగుతోంది. ఇక హైదరాబాద్ నగరంలో అయితే వీకెండ్ వచ్చిందంటే.. సెలవులు వచ్చాయంటే పదుల సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ఇక్కడి పోలీసులు డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు నిత్యం పబ్‌లపై, డ్రగ్స్ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ దాడుల్లో కొంత మంది తప్పించుకుంటుండగా.. చాలా వరకు పట్టుబడుతున్నారు. ప్రతీ వీకెండ్‌లో పోలీసులు దాడులు నిర్వహిస్తున్నా.. పట్టుబడుతున్న వారిని అరెస్ట్ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నా.. వినియోగదారుల్లో మార్పు రావడం లేదు. నిన్న రాత్రి సైతం నగరంలో డ్రగ్స్ పట్టుబడింది. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలోని ఐదు పబ్‌లపై అర్ధరాత్రి దాడులు చేశారు. నలుగురు వ్యక్తులు రెండు చోట్ల డ్రగ్స్ సేవించినట్లు గుర్తించారు. వారిని పట్టుకొని పాజిటివ్ పరీక్ష నిర్వహించారు. టీజీఎన్ఏబీ అధికారులు, ఎక్సైజ్ పోలీసులు కలిసి ఉమ్మడిగా ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, అనిల్ కుమార్ రెడ్డి నేతృత్వంలో దాడులు కొనసాగాయి. పెద్ద ఎత్తున కొనసాగిన ఈ దాడుల్లో 33 మంది వ్యక్తులు డ్రగ్స్ సేవించినట్లుగా పోలీసులు అనుమానించారు. వారందరి నుంచి మూత్రం శాంపిల్స్ సేకరించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్‌లను ఉపయోగించి పరీక్షించారు. 33 మందిలో నలుగురికి పాజిటివ్ వచ్చింది. అయితే.. ఒకే పబ్‌లోని వ్యక్తులకు కాకుండా.. మాదాపూర్‌లోని ఓ పబ్‌లో ఏడుగురిలో ఇద్దరికి, జూబ్లిహిల్స్‌లోని మరో పబ్‌లో 12 మందిలో ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిలో హైదరాబాద్, శ్రీకాకుళం, వరంగల్ నగరాలకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు.



# నిమజ్జనాలకు ట్యాంక్ బండ్ నో..

**చేవెళ్ల , సెప్టెంబర్ 14 నినాదం న్యూస్**




బ్యానర్లు ఏర్పాటు! వినాయక చవితి అనంతరం గణేశ్ విగ్రహాల నిమజ్జన వేళలో హుస్సేన్ సాగర్ లో వేసే అలవాటు చాలామంది హైదరాబాదీలకు ఉంటుంది. ఆగస్టు వచ్చిందంటే చాలు పండుగల సందడి షురూ అయినట్లే. శ్రావణ శకుక్రవారాలతో మొదలై.. భాద్రపదంలో వినాయక చవితితో సందడి మరింత పెరుగుతుంది. దీపావళి వరకు వరుస పండుగలతో వాతావరణం మొత్తం ఉత్సాహవంతంగా ఉంటుందన్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితి ఎంత భారీగా సాగినా.. హైదరాబాద్ లో ఉండే హడావుడితో పోలిస్తే తక్కువే. వినాయక చవితి అనంతరం గణేశ్ విగ్రహాల నిమజ్జన వేళలో హుస్సేన్ సాగర్ లో వేసే అలవాటు చాలామంది హైదరాబాదీలకు ఉంటుంది.

అయితే.. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సాగర్ లో విగ్రహాల నిమజ్జనాలకు పర్మిషన్ లేదంటూ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. అంతేకాదు.. హుస్సేన్ సాగర్ లో వినాయక విగ్రహాల్ని పడేయకుండా ఉండేలా చుట్టూ ఇనుప కంచెల్ని ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ వద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయొద్దంటూ లాయర్ వేణుమాధవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో హైడ్రాను కూడా చేర్చాలని కోరారు. హుస్సేన్ సాగరర్ పరిరక్షణ బాధ్యతల్ని హైడ్రా నిర్వహిస్తోందన్న పిటిషనర్.. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల్ని అమలు చేయట్లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ట్యాంక్ బండ్ చుట్టూ ఎత్తైన ఇనుప కంచెల్ని ఏర్పాటు చేసి.. నిమజ్జనానికి అనుమతి లేదంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే.. ఈ నిర్ణయంపై భాగ్యనగరి గణేశ్ ఉత్సవ సమితి తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తోంది.

హుస్సేన్ సాగర్ లో గణేశ్ నిమజ్జనం చేయొద్దని చెప్పటానికి అధికారులు ఎవరు? అని ప్రశ్నిస్తూ.. హుస్సేన్ సాగర్ లోనే గణేశ్ నిమజ్జనం చేస్తామన్న గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి భగవంతరావు.. "వాళ్లు చెప్పేది వాళ్లు చెబుతారు. మేం చేసేది మేం చేస్తాం. హుస్సేన్ సాగర్ అంటేనే వినాయక సాగర్. గణేష్ నిమజ్జనంతో హుస్సేన్ సాగర్ కలుషితం అవుతుందని అంటున్నారు. మరి.. నాలాల ద్వారా వచ్చే కెమికల్ వాటర్.. డ్రైనేజీ నీళ్లతో సాగర్ మరింత కలుషితం అవుతుంది. మొదట దాన్ని అడ్డుకోవాలి. ప్రతిసారి గణేష్ ఉత్సవాల సమయంలో హుస్సేన్ సాగర్ లో గణేష్ నిమజ్జనం చేయవద్దని గందరగోళం సృష్టిస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా హుస్సేన్ సాగర్ లోనే గణేష్ నిమజ్జనం చేస్తాం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మరాయి.

# హైడ్రా రికవరీ చేసిన భూముల విలువ రూ.వెయ్యి కోట్ల పైనే..

**చేవెళ్ల , సెప్టెంబర్ 14 నినాదం న్యూస్**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ విన్నా.. ఏ నోట విన్నా.. హైడ్రా.. హైడ్రా.. హైడ్రా అనే పేరే వినిపిస్తోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ విన్నా.. ఏ నోట విన్నా.. హైడ్రా.. హైడ్రా.. హైడ్రా అనే పేరే వినిపిస్తోంది. కేవలం హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రా కోసం జిల్లా నుంచి కూడా డిమాండ్ వచ్చింది. తమతమ జిల్లాల్లోనూ ఏర్పాటు చేయాలని కోరారు. దానిపై ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్లకు ఆ బాధ్యత అప్పగించారు. కట్ చేస్తే.. హైడ్రా ఏర్పాటు నుంచే కబ్జాదారుల్లో, అక్రమాలకు పాల్పడిన వారి వెన్నులో వణుకుపుడుతోంది. ఎప్పుడు ఎవరికి ఎలాంటి నోటీసులు అందుతాయా..? లేదంటే ఏ ఆస్తి విధ్వంసానికి గురవుతుందా..? అని టెన్షన్ పడుతున్నారు. పేద, ధనిక, పొలిటికల్, సినిమా స్లార్లు అని తేడా లేకుండా హైడ్రా తన పని తాను చేసుకుంటూ వెళ్తోంది. దీంతో ఏ స్థాయిలో ఉన్న వారికైనా భయాందోళన వీడడం లేదు. అంగుళం ప్రభుత్వ స్థలాన్ని కూడా వదలిపెట్టకుండా మొత్తం రికవరీ చేయాలనే లక్ష్యంతోనే హైడ్రా ముందుకు సాగుతోంది. - విడదల రజని...టీడీపీతో ప్యాచప్! ఇదిలా ఉండగా.. హైడ్రా ఇప్పటివరకు ఎన్నో కట్టడాలను కూల్చి ప్రభుత్వ ఆస్తులను రికవరీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవలే నివేదిక సైతం సమర్పించారు. ఏజెన్సీ జూన్ 27న తన కార్యకలాపాలను ప్రారంభించింది. అప్పటి నుంచే ఆస్తుల రికవరీ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు 262 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు కమిషనర్ వెల్లడించారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిమితుల్లో 23 ప్రాంతాలలో పనిచేసినట్లు తెలిపారు. ఐపాక్ రిషి...సాఫ్ట్ వేర్ కంపెనీ పెట్టాడా ? అలాగే.. ఇప్పటివరకు 111.72 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు రంగనాథ్ తెలిపారు. అయితే.. స్వాధీనం చేసుకున్న భూముల విలువ చూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బంజారాహిల్స్‌లోని లోటస్ పాండ్, జూబ్లీహిల్స్‌లోని నందగిరి కొండలు వంటి హై ప్రొఫైల్ ఏరియాల్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. అందులో సినీనటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సైతం ఉంది. వాటన్నింటినీ తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటి విలువ భూముల మార్కెట్ వ్యాల్యూ ప్రకారం రూ.వెయ్యి కోట్ల పైనే ఉంటుందంట.

## నిమ్స్ కు 'యూకే' వైద్య బృందం

**- ఉచిత గుండె శస్త్ర చికిత్సలు**

**చేవెళ్ల సెప్టెంబర్ 14 (నినాదం న్యూస్ ):**

గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు యూకే వైద్య బృందం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు.. యూకే వైద్యులు నిమ్స్ హాస్పిటల్‌కు రానున్నట్లు నిమ్స్ హాస్పిటల్ సంచాలకులు డాక్టర్ బీరప్ప ఒక ప్రకటనలో వెల్లడించారు.

అయితే, యూకేలో స్థిరపడిన డాక్టర్ రమణ దన్నపనేని ఆధ్వర్యంలోని వైద్య బృందం.. ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు నిమ్స్ భాగస్వామ్యంతో గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న చిన్నారులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఎవరైతే ఆర్థిక ఇబ్బందులతో తమ చిన్నారులకు గుండె శస్త్ర చికిత్స చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారో.. ప్రత్యేకంగా వారి కోసమే ఉచితంగా వైద్యం అందించనున్నారు. ఈ నెల 22 నుండి 28 వరకు హైదరాబాద్ లోని నిమ్స్‌లో ఉచిత గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిమ్స్ సంచాలకులు




బీరప్ప మాట్లాడుతూ.. "గుండెకు రంధ్రం, ఇతర గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులు ఉచిత వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. యూకే వైద్య బృందంతో పాటు నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమరేశ్వరరావు, ఇతర సీనియర్ వైద్యులు ఈ శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. కాగా గుండె సంబంధిత ఉచిత వైద్య సేవలను పొందాలనుకునేవారు పంజాగుట్ట నిమ్స్ లోని కార్డియో థొరాసిక్ వైద్యులను సంప్రదించాలి" అని డాక్టర్ బీరప్ప వెల్లడించారు.